## అందరినీ భయపెడుతున్న ఆ మంటలదెయ్యం ఎలా అదృశ్యమయ్యింది?

# మంటలదెయ్యం

వసంతరావు రామకృష్ణారావు

కథ

నేను ఆ నగరంలో పనిచేసే రోజులలో ప్రతీ సాయంత్రం షికారుగా మూడు కిలోమీటర్ల దూరంవెళ్లి మరలా వచ్చి స్నానం చేసి, పత్రికలు చదువుతూ కాలం గడిపే వాడిని. ఆ నగరానికి చాలా దూరంలోవున్న రాజుపాలెం గ్రామానికి అప్పుడప్పుడు తనఖీకి వెళ్తూ వుండేవాడిని. అయితే ఇందుకోసం మా ఆఫీసు జీపూ, కొంతమంది సబార్డినేట్సు నాతోరావడం జరుగుతూ వుండేది.

ఇలాగే, ఒకరోజు ఉదయం అందరం టిఫిన్‌చేసి, రాజుపాలెం గ్రామానికి బయలుదేరాం. నేను ఆఫీసర్‌గా వున్నా, అధికార దర్పం, అజమాయిషీ, ఆడంబరం, ఇలాంటివి లేకుండానే నా సబార్డినేట్స్‌తో చాలా చనువుగా వుండేవాడిని. వారందరితోనూ చాలా సరదాగా మాట్లాడేవాడిని. అలాగే, నా జీవితంలో ముఖ్యంగా నేను విజయనగరం మహారాజావారి కాలేజీలో చదువుకునేరోజుల్లో జరిగిన అనేక సంఘటనలను, అనుభవాలను చెపుతూ వుండేవాడిని. వారంతా వినడంలో ఆసక్తి చూపేవారు. ఉద్యోగరీత్యా, బాధ్యతగల ఒక అధికారిగా, నాపై వుండే టెన్షను తగ్గించుకోడానికి, ఒక విధంగా రిలాక్సు కావడానికి నేను మాట్లాడడం అలవాటు చేసుకోవడంతోపాటు తోటి ఉద్యోగులు తమ తమ అనుభవాలను, సన్నివేశాలను, సంఘటనలను చెప్పడానికి అవకాశం ఇచ్చేవాడిని. వారు చెప్పే విషయాలను నేను శ్రద్ధగా వినడంవలన వారు ఆనందిస్తూ వుండేవారు.

మా జీపు సుమారు 6 కిలోమీటర్ల దూరం దాటి వుంటుంది. ఆ ప్రదేశం చాలావరకు




నిర్మానుష్యంగా వున్నది. రోడ్డుకు రెండువైపులా, దారి పొడుగునా చెట్లు వున్నాయి. అవి దగ్గరగానూ, దట్టంగానూ ఉన్నందువలన సూర్యోదయం అయినప్పటికీ, వెలుతురు కనబడడంలేదు. లైట్లు వేసి, చాలా మెల్లిగా నడుపుతున్న జీపు డ్రైవర్ నాతో ''సార్! ఇక్కడ మనం ఒక ఐదు నిమిషాలు ఆగి వెళ్లాలి'' అంటూ, నా జవాబుకోసం చూడకుండానే జీపు

ఆపివేశాడు.

కొంతసేపు నిశ్శబ్దం - అందరం జీపులోనే ఉన్నాం - అప్పుడు సీనియర్ సర్వేయర్ సుందరం ఇలా అన్నాడు. ''సార్! మీకు ఈ ప్రాంతం అంతా కొత్త. నేను ఇక్కడ పదేళ్లనుండి ఉంటున్నాను. మనం ఉన్న ఈ ప్రాంతానికి సుమారు మూడు వందల గజాల దూరంలో ఒక చిన్న ప్రదేశం ఉన్నది. దానిచుట్టూరా దట్టమైన మొగలిపొదలూ, బ్రహ్మచెముడు మట్టలూ వున్నాయి. సాధారణంగా ఉదయం పూటా, ముఖ్యంగా సాయంత్రం పూటా, అక్కడ హఠాత్తుగా మంటలు లేస్తూంటాయ్. అక్కడ మనుష్యులు ఎవరూ వుండరు. జంతు సంచారం వుండదు. ఆఖరికి, చెట్లమీద పక్షులు ఉన్న జాడకూడా కనిపించదు. ఆ విధంగా లేచిన మంటలను మా గ్రామస్తులు మంటల దెయ్యం అంటూ వుంటారు. మా గ్రామంలోని వాళ్లు ఎవరూ ఉదయంకానీ, సాయంత్రంకానీ ఆ చుట్టుప్రక్కల ప్రాంతానికి రారు. ఆ మంటల దెయ్యం గురించి చాలామంది తమతమ అనుభవాలను చెపుతూ వుంటారు. నాకు తెలిసిన ఒక పన్నెండేళ్ల కుర్రాడు ఈ మంటల దెయ్యాన్నిచూసి జడుసుకుని, తీవ్రంగా జబ్బుపడితే ఆ కుర్రాడి తల్లి తన పుట్టింటికి వెళ్లి భూతవైద్యం చేయించింది. ఇంకోసారి మా ప్రక్క గ్రామానికి చెందిన యువకుడుకూడా ఈ మంటలకి భయపడి, ఒక రకమైన అర్థంలేని మాటలాడడం మొదలుపెడితే మేమందరం భయపడ్డాం'' ఆ విధంగా చెప్పుకుంటూ పోతున్న సుందరంకూడా కొంత భయపడినట్లు నేను గమనించేను. అతడి కళ్లు, జీపు లైట్ల కాంతిలో కాస్త ఎర్రగా వున్నాయి. ప్రక్కనే వున్న వాటర్ బాటిల్ తీసుకుని నీళ్లు తాగేడు. అతడు చెప్పేది ఇంకా పూర్తికాలేదని గమనించాను. చేతిలో వాచీ ప్రకారం ఉదయం 9 అవుతున్నా మా జీపు ఆగిన ప్రాంతంలో దట్టంగా ఉన్న చెట్లు, గుబుర్లు, పొదలు - వీటివలన సూర్యరశ్మి బాగా రాలేదు. పది నిమిషాలైనా జీపు స్టార్టు కాలేదు. పోనిమ్మని అందామంటే అతడు చెప్పినదానిని బట్టి అందులో ఉన్నవారంతా ఒక రకమైన భయానికి లోను అయినట్లనిపించింది. నాకు దెయ్యాలన్నా, భూతాలన్నా, దేవుడు మనుష్యులమీద పూనడం అన్నా, ఏమీ నమ్మకం లేకపోయినా అతడు చెబుతున్న దానిని శ్రద్ధగా వినడంవల్ల, మా అందరిమధ్యా భయంతో కూడిన నిశ్శబ్దం ఆవరించి వున్నది.

సుందరం మళ్లీ ఇలా చెప్పడం మొదలుపెట్టాడు. ''నాకుకూడా ఇలాంటి అనుభవమే కలిగింది. నేను ఆ మంటల దెయ్యాన్నిచూసి జడుసుకున్నాను. జ్వరం వచ్చింది. వాంతులు అయినాయి. శరీరం వణుకుతూనే వుండేది. రాత్రిళ్లు నిద్రపట్టేదికాదు''

అతడిని చూస్తూ నేనడిగేను ''నీకు ఆ దెయ్యం ఏదైనా ఒక రూపంలో కన్పించిందా?''

అతడు మళ్లీ కొంచెం మంచినీటితో నోరు తడుపుకుని భయంతోనే ''మంటలలో కనపడలేదుకాని రాత్రి కలలో కనిపించింది''

నాకు అతనిమాటలమీద అంత నమ్మకంలేదు. దానికి కారణం నేను దెయ్యాలూ, భూతాలు అనేవి ఉన్నాయి అని నమ్మినవాణ్ణి కాను! ఆ విషయం అతడితో అనకుండా, అంతా ఆసక్తితోవినడంచేత సుందరం ''సార్! నేను కలలో చూసిన ఆ భయంకర రూపం పగలైనా


తలచుకుంటే భయం వేస్తుంది. రాత్రిళ్లు గుర్తుకువస్తే, వెన్నులోంచి వణుకుపుట్టి చెమటలు పోస్తాయి. గొంతు తడారిపోతుంది! అయినా మీరందరూ ఉన్నారుకనుక చెపుతున్నాను. నాకు కలలో కనపడ్డ దెయ్యం ఒక అస్థిపంజరం! రక్త మాంసాలు లేని ఎండిన ఎముకలగూడు! ఆ కళ్లు చింతనిప్పుల్లా నావైపు చూడడంతో భయంతో కలలో నేను కళ్లు మూసుకున్నాను. ఆ దెయ్యం తలమీద మంటలు కనిపించడంతో, అది నా దగ్గరకు రావడంతో నేను పెద్ద కేకపెట్టి, మంచంమీదనుండి క్రింద పడ్డాను! నాకు తెలివి వచ్చింది. గజగజా వణుకుతూ నోట మాట లేకుండా వుండడంతో మా అమ్మగారునాకు దెయ్యం పట్టినదని గ్రహించి, నా చేవ్రేళ్లు తన వ్రేళ్లతో గట్టిగా నొక్కుతూ శ్రీ ఆంనేజయ దండకం బిగ్గరగా చదవడంతో నేనీ లోకంలో పడ్డాను. అయినా మనసంతా చికాకుగా వుండింది. ఏ పనీ చేయలేకపోయేవాడిని. ఎక్కడికైనా వెళ్లాలి అంటే భయంగా వుండేది. నా వెంట ఎవరో తోడు రావలసిందే! రాత్రిళ్లు అప్పుడప్పుడు ఈ విధమైన కలలతో, కలత నిద్రతో రోజులు గడిపేవాడిని. నా పరిస్థితి గమనించిన మా మేనత్త వాళ్ల ఊరికి తీసుకువెళ్లి భూతవైద్యం చేయించడంతో నేను మామూలు స్థితికి రాగలిగేను. ఒక్క విషయం సార్! ఈ అనుభవం అనుక్షణం నన్ను వెంటపెడుతూ, వేధిస్తూ, బాధిస్తూ ఉన్నది''

జీపు కదిలింది. మా పని ముగించుకుని, మరలా సాయంత్రం బయలుదేరాము. అయితే బాగా చీకటిపడింది. సుందరం చెప్పిన మంటల దెయ్యం విషయం నా మనసులో మెదులుతూనే వున్నది. నేను భయపడలేదు. కాని దాని విషయంలో నాకేదో అనుమానంగానే వుండడంతో జీపును వాళ్లు చెప్పిన ప్రాంతంలోనే ఆపమని చెప్పాను. సుందరంబాగా భయపడినట్లు కనిపించింది. రాత్రికి ఉండి మరునాడు ప్రొద్దుటే వెళ్దామని సుందరం అన్నాడు. నాకు అది నచ్చలేదు. సుందరంతో ''నేను, మా స్టైనో ఈ ప్రదేశంలోనే దిగి ఈ దెయ్యం సంగతి

## కాలర్

''చొక్కాకి కాలర్ పెట్టొద్దంటున్నారు. వుంటే కాలరెగరేసుకుని తిరుగుతున్నాడనుకుంటారనా?'' ఆశ్చర్యంగా అడిగాడు టైలర్.

''హబ్బే కాదు. అప్పులోళ్లు కాలర్ పుచ్చుకుని అడుగుతారేమోనని...'' భయంగా అన్నాడు అప్పారావు.



- అడబాల సూర్యనారాయణ (తుని)

తెలుసుకుంటాను'' అనడంతో అతడు అవాక్కయిపోయాడు. స్టైనో రాజు ''సార్! నేను మీతో వస్తాను. నాకూ దెయ్యాలమీద నమ్మకంలేదు'' అన్నాడు. సుందరం అతనివైపు నిస్పృహాయంగా చూశాడు.

జీపు ఆగింది. నేనూ, స్టైనో ఇద్దరం దిగేం. బాగా చీకటిగా వున్నది. దానికితోడు ఆ ప్రదేశంలో నిశ్శబ్దం భీతికొల్పేదిగా వున్నది. కీచురాళ్ల ధ్వని ఎక్కువగా వున్నది. నాకు లైసెన్సుతో ఉన్న రివాల్వరును చేతి బ్యాగులో పెట్టుకుని, చేతి బ్యాటరీ లైటుతో స్టైనో నా వెనుకనే వస్తుండగా, మెల్లగా అడుగులేసుకుంటూ, ఆ మంటల దెయ్యం వుండే ప్రాంతంవైపు వెళ్తున్నాం. సుందరం, డ్రైవరూ, ఇంకా ఇతర సబార్డినేట్సూ జీపులోనే వుండిపోయారు. స్టైనో నాకు ధైర్యం చెప్తున్నాడు.

''సార్! దయ్యాలు లేవు. ఈ శతాబ్దంలోనూ సుందరంగారిలాంటివాళ్లు దెయ్యాలను నమ్మడం, వాటిగూర్చి భయపడడం చాలా విచిత్రమైన విషయం. ఈ మంటలు ఎవరో వేస్తూ, ప్రక్కనే దాగొని వారికి కావలసిన పనులు చేసుకుంటున్నారేమో అని నా అనుమానం. ఈ ప్రాంతానికి వచ్చేవాళ్లు ఇలాంటి సంఘటనలు వినడం, వానికి భయపడడం, లేనిపోని మానసిక బాధలు అనుభవించడం జరుగుతున్నది. ఆ మధ్య ఒక వ్యాపారి ఈ ప్రదేశం చేరుకోగానే, మంటలుచూసి భయపడి పరుగెత్తేడు. ఆ సమయంలో అతడి దగ్గర వున్న పర్సును ఆ చీకటిలో ఒక నల్లటి దెయ్యం లాగివేసిందట! ఆ దయ్యం బిగ్గరగా అరవడంతో ఆ వ్యాపారి పర్సు దభాలున నేలమీద పడవేసి, వడిగా ఇల్లు చేరుకున్నాడట. భయంతో జ్వరం వచ్చిందట! సైకియాట్రిస్టు ఇచ్చిన చికిత్సతో అతడు తన పనులు చేసుకునే మామూలు స్థితికి వచ్చేడట!''

స్టైనోమాటలు వింటూ ముందుకెళ్తున్న నాకు మంటలు కనిపించడం, ఆ వెంటనే నల్లటి దుస్తులలో మానవ ఆకారం గబగబా పరుగెత్తడం జరిగేయి. రివాల్వర్ తీసి అటువైపుగా బుల్లెట్ వదిలాను. ఒక మనిషి అరిచినట్లు వినిపించింది. ఈ లోగా ఇంకో నల్లటి ఆకారం కదిలింది. మళ్లీ మరో బుల్లెట్ వదిలాను.

రెండు మూడు నిమిషాల తర్వాత మేమిద్దరం అటువైపుగా మెల్లగా వెళ్లాము. ఆశ్చర్యం! నల్లని ముసుగులు తీసేసి గాయాలతో నేలపై పడివున్న ఇద్దరు మనుష్యులు కనిపించారు. వారిద్దరూ భయంతో ''సార్! మమ్మల్ని కాపాడండి. మేం దెయ్యాలం కాము. డబ్బు కోసం ఇలాగ భయపెట్టి మా జీవనం గడుపుతున్నాం. మాది ఈ ప్రక్కనే ఉన్న గ్రామం. దయచేసి అక్కడికి మమ్మల్ని చేర్చండి! బాబూ మరో మనవి'' ఈ మాటలతో వారికేసి చూస్తున్న నాకు వాళ్ల వంటినుండి రక్తం కారడం దృశ్యం మనసుకి బాధ కలిగించింది. ''ఏమిటది?'' అన్నాను విసుగ్గా, కసురుకునే ధోరణిలో.

''మాగురించి ఎవ్వరికీ చెప్పకండి. దయతో మమ్మల్ని మా గ్రామంలో వదిలేయండి! పోలీసోళ్లకి అప్పచెప్పకండి.'' వాళ్లదీనాలాపాలు బలహీనంగా వున్న నా మనసుమీద బాగా పనిచేశాయి. స్టైనో సాయంతో వాళ్లిద్దరినీ జీపు ఎక్కించుకుని, వాళ్లని గ్రామంలో విడిచిపెట్టి, మరల ఆఫీసు చేరుకున్నాం.

సుందరం మా ఇద్దరి ధైర్యానికి ఆశ్చర్యపడ్డాడు. అతడికి ఏమీ అర్థంకాలేదు.

దానికి కారణం మంటలదెయ్యం అనే భయం కారణం!

మరునాడు సుందరానికి జరిగినదంతా చెప్పేను. విని ఆశ్చర్యపడి, తన పిరికితనానికి సిగ్గుపడినాడు. ఆరోజే అక్కడ ఉన్నవాళ్లందరికీ సుందరం ఇలా చెప్పడం నేనువిన్నాను. ''మా ఆఫీసర్ సాబుగారు మంటలదెయ్యం ఉండే ప్రదేశానికి వెళ్లి ఆ మంటలను ఆర్పి, దెయ్యాన్ని హతమార్చేరు. ఇక మంటల దెయ్యం భయం మనకు అక్కర్లేదు''

అయితే ఆ మంటల దెయ్యం సంగతి నాకూ, మా స్టెనోకూ తప్ప మరెవరికీ తెలీకుండా వుంచేము.

★

